సాక్షి
విశాఖపట్నం
శనివారం । 24 । జూన్ । 2023



అప్పన్నకు గరుడసేవ

వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శుక్రవారం జరిగిన గరుడ సేవలో ఒడిశా భక్తులు పాల్గొని తరించారు. 10లో



డ్రగ్‌ఫ్రీ సిటీగా విశాఖ

డ్రగ్‌ఫ్రీ సిటీగా విశాఖను తీర్చిదిద్దడానికి అన్ని వ్యవస్థలు సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ మల్లికార్జున పిలుపునిచ్చారు. 10లో

చిత్రలేఖనంలో ప్రతిభ



ఫాదర్స్ డే సందర్భంగా దుబాయ్‌కి చెందిన ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సంస్థ నిర్వహించిన చిత్రలేఖన పోటీలో నగరానికి చెందిన శ్రీనివాసరావు ప్రపంచస్థాయి గుర్తింపు పొందారు. 10లో

న్యూస్‌రీల్

అప్పన్నను దర్శించుకున్న రజత్ భార్గవ



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న రజత్ భార్గవ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ భార్గవ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

నేడు డిప్యూటీ సీఎం రాక

మహారాణిపేట: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర శనివారం విశాఖ వస్తున్నారు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ఉదయం విశాఖ చేరుకొని అక్కడ నుంచి నేరుగా ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుంటారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని మధ్యాహ్నం 3 గంటలకు రోడ్డు మార్గంలో సాలూరు వెళతారు.

జిల్లా మలేరియా అధికారిగా తులసి



జిల్లా మలేరియా అధికారికి అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

మద్దిలపాలెం : జిల్లా మలేరియా అధికారిగా తులసి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా మలేరియా అధికారిగా విధులు నిర్వహిస్తున్నా ఈమె బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇక్కడ ఇంత వరకూ ఇక్కడ పనిచేసిన జిల్లా మలేరియా అధికారి.వై.మణి బదిలీపై విజయనగరం వెళ్లారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీల రిఫరీగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

ఉక్కునగరం: జాతీయ బాక్సింగ్ పోటీల రిఫరీగా స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం డిప్యూటీ మేనేజ ర్ కె. శ్రీనివాసరావు నియమితులయ్యారు. జూన్ 25 నుంచి జూలై 1 వరకు భోపాల్‌లో 6వ యూత్ ఉమెన్ జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు రిఫరీగా శ్రీనివాసరావును నియమిస్తూ ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీఏ లక్ష్మణదేవ్ ఉత్తర్వులు అందజేశారు. శ్రీనివాసరావును స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం సీజీఎం కేహెచ్ ప్రకాశ్, విభాగం అధికారులు అభినందించారు.

26 నుంచి మహిళల టెన్నిస్ టోర్నీ

తగరపువలస: ఈ నెల 26 నుంచి 30 వరకు చిట్టివలస మెడోస్ స్పోర్ట్స్ విలేజ్‌లో ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ (ఏఐటీఏ) ఆధ్వర్యంలో డాక్టర్ ఎస్ ఝాన్సీలక్ష్మి మెమోరియల్ మహిళల టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో గెలుపొందిన విజేతలకు రూ.లక్ష బహుమతి అందించనున్నట్టు టోర్నమెంట్ డైరెక్టర్ చల్లారపు శ్రీనివాసరావు, రిఫరీ మరడ శివకుమార్ తెలిపారు.

భారీ అగ్నిప్రమాదం



కార్ డెకార్స్‌లో ఎగిసిపడుతున్న మంటలు

సీతమ్మధార : ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని హైవేపై వైజాగ్ కార్ డెకార్స్‌లో శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రాత్రి 8.10 గంటలకు వైజాగ్ కార్ డెకార్స్ క్లోజ్ చేసి యజమానితో పాటు సిబ్బంది వెళ్లిపోయారు. రాత్రి 9 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారొచ్చి మంటలు అదుపులోకి తెచ్చారు. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. లా అండ్ ఆర్డర్ సీఐ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

607 సచివాలయాలు.. 21 రోజుల క్యాంపులు

- జగనన్న సురక్షకు షెడ్యూల్ ఖరారు
- నేటి నుంచి వలంటీర్ల ఇంటింటా సర్వే
- జూలై 1 తొలివిడత సురక్ష క్యాంపులు ఏర్పాటు
- లబ్ధిదారులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం



సాక్షి, విశాఖపట్నం : అర్హులైనా.. పథకాలు అందడం లేదా..? ఇకపై ప్రజలెవ్వరూ ఇలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సరికొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్హులై ఉండీ.. ఏ ఒక్కరూ లబ్ధి అందకుండా బాధపడకూడదనే సంకల్పంతో ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం నుంచి జిల్లాలో ప్రారంభం కానుంది. ప్రతి ఇంటికీ వలంటీర్లు వెళ్లి ఆ ఇంట్లో ఉన్న వారికి ఏయే పథకాలు అందుతున్నాయి.. లబ్ధిదారులుగా ఉండి కూడా.. పథకాలు దక్కకపోయినా వారి వివరాలు తీసుకోనున్నారు. ఆ కుటుంబంలో ఎవరికి ఏం అవసరం అనేది తెలుసుకొని ఏం చేస్తే వారు ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందుతారో అనే సర్వీస్ రిక్వెస్టులను రిజిస్టర్ చేసి టోకెన్ నంబర్ ఇవ్వనున్నారు. వారం రోజుల తర్వాత ఆ సచివాలయాల పరిధిలో నిర్వహించే సురక్ష క్యాంపుల్లో వారికి అవసరమైన ధ్రువపత్రాలు, ఇతర లబ్ధి చేకూర్చనున్నారు. జిల్లాలో శనివారం నుంచి వలంటీర్ల ఇంటింటికీ వెళ్లి జల్లెడ పట్టే కార్యక్రమం ప్రారంభం కానుంది. తొలి రోజున 68 సచివాలయాల పరిధిలో 1,020 మంది వలంటీర్లు శ్రీకారం చుట్టనున్నారు. సదరు కుటుంబానికి ఏం కావాలన్న అంశాన్ని వలంటీర్లు జగనన్న సురక్షలో అప్‌లోడ్ చేస్తారు. దీని ద్వారా 11 రకాల సర్వీసులకు సంబంధించి ఉచిత సేవలు అందనున్నాయి. **ఇప్పటికే జగనన్న సురక్షకు సంబంధించి డీఎల్‌డీవో పూర్ణిమాదేవి ఆధ్వర్యంలో మండల స్థాయిలోనూ, సచివాలయ స్థాయిలోనూ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ అందించారు. క్యాంపుల నిర్వహణకు రూరల్‌లో 2 టీమ్‌లు, అర్బన్ పరిధిలో 3 టీమ్‌లు ఏర్పాటు చేశారు.** అర్బన్‌లో జీవీఎంసీ పరిధిలో 5 సచివాలయాల్ని ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. సురక్ష క్యాంపుల్లో రిజిస్ట్రేషన్ డెస్క్, వెరిఫికేషన్ డెస్క్, సర్వీస్ రిక్వెస్ట్ డెస్కులు ఏర్పాటు చేయనున్నారు. వలంటీర్ల సర్వే సమయంలోనూ ఎవరైనా మిస్ అయితే.. క్యాంపు రోజున కూడా రిజిస్టర్ చేసుకోవచ్చు. అక్కడికక్కడే వెరిఫై చేసి సమస్యను పరిష్కరిస్తారు. జిల్లా వ్యాప్తంగా 607 సచివాలయాలకు సంబంధించిన షెడ్యూల్‌ని కలెక్టర్ డా.మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి కలిసి తయారు చేశారు. 21 రోజుల పాటు క్యాంపులు జరగనున్నాయి. జూలై 1వ తేదీన 68 సచివాలయాలతో ప్రారంభమై జూలై 26నాటికి 12 సచివాలయాలతో సురక్ష క్యాంపులు ముగియనున్నాయని అధికారులు తెలిపారు.

హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రాక రేపు

మహారాణిపేట: ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి ఆదివారం విశాఖ వస్తున్నారు. విజయవాడ నుంచి గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ఉదయం విశాఖ చేరుకుంటారు.

గిరి ప్రదక్షిణకు పటిష్ట బందోబస్తు

- భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు
- గిరిప్రదక్షిణ మార్గంలో సీపీ త్రివిక్రమ్ వర్మ పర్యటన

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని నగర సీపీ త్రివిక్రమ్‌వర్మ అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 2న జరిగే గిరి ప్రదక్షిణకు చేస్తున్న బందోబస్తు ఏర్పాట్లను సీపీ శుక్రవారం ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. భక్తులు ప్రదక్షిణ చేసే అన్ని ప్రాంతాల్లోను పార్కింగ్‌తో పాటు భక్తుల కోసం చేస్తున్న వసతి ఏర్పాట్లపై ఆరా తీశారు. ప్రధానంగా జనసమ్మర్దం ఎక్కువగా ఉండే ప్రాంతాలు సింహాచలం పుష్కరిణి, తొలిపావంచా, ఇతర ప్రాంతాలను పరిశీలించి బందోబస్తు ఏర్పాట్లపై సూచనలు చేశారు. గిరి ప్రదక్షిణకు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా పూర్తి ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అనంతరం భక్తులు ప్రయాణించే దేవస్థానం బస్సులో అధికారులతో పాటు ప్రయాణించి కొండపై పలు ప్రాంతాలను పరిశీలించారు. ఘాట్ రోడ్డులో బస్సుల రాకపోకలకు అంతరాయం కలగకుండా చేపట్టాల్సిన చర్యలను వివరించారు. గిరి ప్రదక్షిణ ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు విద్యాసాగర్ నాయుడు, నాగన్న, ఆనంద్‌రెడ్డి, ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీలు అన్నెపు నర్సింహమూర్తి, రాజీవ్‌కుమార్, జాన్ మనోహర్, గోపాలపట్నం సీఐ నరసింహరావు, ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



అధికారులతో కలిసి బస్సులో కొండపైకి వెళుతున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ

భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): గిరి ప్రదక్షిణ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. లుంబినీ పార్క్, సీతమ్మధార, కైలాసపురం, మురళీనగర్, గోపాలపట్నం, పాత గోశాల, తొలిపావంచా, అడవివరం, ముడసర్లోవ, హనుమంతువాక, సాగర్‌నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 32 కిలోమీటర్ల మేర గిరిప్రదక్షిణ మార్గాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కొండ చుట్టూ 100 చోట్ల, కొండపై 10 ప్రాంతాల్లో స్టాళ్ల ఏర్పాటు చేసి, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. 13 మెడికల్ క్యాంపులు, 18 ప్రథమ చికిత్స కేంద్రాలు, 7 ప్రాంతాల్లో 108 వాహనాలు అందుబాటులో ఉంచి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణంరాజు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, సీఎంహెచ్‌వో డాక్టర్ నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు, జోనల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ, ఎమ్మెల్యే వాసుపల్లి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.ఎస్ విశ్వనాథన్, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జున ఈ కార్యక్రమం అమలుపై తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే 'జగనన్న సురక్ష'కార్యక్రమ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి జూలై 23వ తేదీ వరకు వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటారని..అర్హులకు పథకాలు అందకపోతే వెంటనే వర్తింపజేస్తారని తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి ప్రత్యేక శిబిరాల నిర్వహణ కోసం మండలాల వారీగా ఎంపీడీవోలు, తహసీల్దార్ల ఆధ్వర్యంలో రెండు వేర్వేరు బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కో బృందంలో ముగ్గురు చొప్పున మండల స్థాయి అధికారులు ఉంటారని, మొత్తం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతారన్నారు.

నేటి తరానికి వెంకయ్యనాయుడు ఆదర్శం

కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



అధికారులతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు దంపతులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

కొమ్మాది: క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధతతో ఉప రాష్ట్రపతిగా ఎదిగిన వెంకయ్యనాయుడును నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు 50 ఏళ్ల ప్రజాజీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా 'సేవానుబంధం, సహచర బృందం'పేరిట రుషికొండలో ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ నేడు తాను ఈ స్థాయిలో ఉండడానికి వెంకయ్యనాయుడే కారణమని అన్నారు. చిన్నప్పటి నుంచి వెంకయ్యనాయుడు దంపతులు నన్ను ఒక బిడ్డలా చూసుకున్నారని భావోద్వేగానికి గురయ్యారు. ఏ పనిలోనైనా నీతి, నిజాయతీ ఉంటే ఎంతటి శిఖరాన్నైనా చేరుకోగలమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా పద్ధతిగా, నీతివంతంగా ఎదగాలన్నారు. అనంతరం తనతో పని చేసిన ఐఏఎస్ అధికారులు, వ్యక్తిగత సిబ్బందిని వెంకయ్యనాయుడు సన్మానించారు.

ట్రాన్స్‌జెండర్స్‌ను గౌరవించాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ

విశాఖ-లీగల్ : ట్రాన్స్‌జెండర్స్ హక్కులు గుర్తించి, వారిని గౌరవించాలని సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ అన్నారు. శుక్రవారం ట్రాన్స్‌జెండర్ హక్కులపై జిల్లా కోర్టు సముదాయంలోని న్యాయ సేవా సదన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ పౌరులకు ఉండే అన్ని పౌర హక్కులు ట్రాన్స్‌జెండర్స్ కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి ట్రాన్స్‌జెండర్ తప్పనిసరిగా ప్రభుత్వం నుంచి గుర్తింపు కార్డు పొందాలని, దీనివలన ఆధార్ కార్డు, ఓటర్ కార్డు , రేషన్ కార్డు , బ్యాంక్ అకౌంట్ వంటివి సులభంగా పొందవచ్చన్నారు. న్యాయ పరమైన సలహాలకు టోల్ ఫ్రీ నంబర్ 15100 , ప్రభుత్వ పరంగా 1901కు సంప్రదించవచ్చని సూచించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిని జె.మాధవి, ఏసీపీ వి.సునీల్, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి సూర్యప్రకాశరావు, జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టర్ డైరెక్టర్ వెంకటేశ్వరి, మెప్మా డీపీవో సూర్యకళ, సీనియర్ అడ్వకేట్లు జి.లక్ష్మి, రాంబాబు, సిస్టర్ అమత, నీతోడు సొసైటీ ఫర్ ట్రాన్స్‌జెండర్స్ పర్సన్లు, వన్ స్టెప్ సెంటర్ సభ్యులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, ట్రాన్స్ జెండర్లు పాల్గొన్నారు.

ఆకాశవాణిలో ఆడిషన్ కోసం దరఖాస్తులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఆకాశవాణిలో కొత్తగా ఆడిషన్ కోసం సంగీత కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కర్ణాటక, హిందుస్థాని, శాస్త్రీయ సంగీతాలతో పాటు, లలిత, భక్తి, జానపద సంగీతాల్లోని వివిధ విభాగాల్లో ఈ ఆడిషన్ పరీక్షలు జరగనున్నాయి. ఆసక్తి గలిగిన వారు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే పంపాలని ఆకాశవాణి కార్యక్రమ నిర్వాహకుడు బి.ఆర్.ఎస్.ప్రకాశరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం mas.prasarbharati.org వెబ్‌సైట్‌లో పొందవచ్చునని పేర్కొన్నారు.

పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 57.84 శాతం ఉత్తీర్ణత

అరిలోవ : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ-2023 పరీక్షల ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసింది. ఈనెల 2 నుంచి 10 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. వీటి మూల్యాంకణం కోసం స్పాట్ వాల్యుయేషన్ ఈనెల 13, 14న జరిగింది. మూల్యాంకణం ముగిసిన అనంతరం ఫలితాలు విడుదల చేశారు. ఈ ఫలితాల్లో విశాఖ జిల్లాలో 57.84 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో 5,408 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టులలో ఈ పరీక్షలు రాశారు. వారిలో 3,175 మంది బాలురు కాగా, 2,233 మంది బాలికలు పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం పరీక్షలు రాసిన విద్యార్థులలో 3,128 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో బాలురు 1,818 మంది, బాలికలు 1,310 మంది ఉత్తీర్ణులయ్యారని డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు.

వెబ్‌సైట్‌లో ఫలితాలు : ఫలితాలు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. విద్యార్థులు మార్కులు జాబితా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు తమ జవాబు పత్రాల రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 29 లోగా సీఎఫ్‌ఎంఎస్ www.cfms.ap.gov.in ద్వారా సిటిజన్ చలానా చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి సబ్జెక్టుకు రూ.500 చొప్పున చలానా చెల్లించాలన్నారు. జవాబు పత్రాల ఫొటో కాపీల కోసం పునఃధ్రువీకరణ(రీ-వెరిఫికేషన్) కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందు కోసం అభ్యర్థులు సీఎఫ్‌ఎంఎస్ చలానా వెంబ్‌సైట్‌లో ప్రతి సబ్జెక్టుకు రూ.1,000 చొప్పున ఈనెల 29 లోగా చెల్లించాలన్నారు. నగదు, డిమాండ్ డ్రాఫ్టులు ద్వారా చెల్లింపులు అనుమతించబడవని డీఈవో తెలిపారు. దీనికి సంబంధించి పూర్తివరాలు కోసం www.bse.ap.gov.inలో పరిశీలించవచ్చన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

- ఎంఎస్ఎంఈల క్లైంలకు త్వరగా పరిష్కారం
- కలెక్టర్ మల్లికార్జున ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట(విశాఖ దక్షిణ): జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) క్లైంలను త్వరగా పరిష్కరించి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. శుక్రవారం ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ(డీఐఈపీసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంఎస్ఎంఈల క్లైములను పెండింగ్ లేకుండా త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ఔత్సాహిక పారిశ్రామివేత్తలకు ప్రోత్సాహం అందించాలన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో పోర్టల్‌కు 70 దరఖాస్తులు రాగా.. 33 దరఖాస్తులను ఆమోదించామన్నారు. ఇండస్ట్రియల్ డెవలెప్‌మెంట్ పాలసీ 2015-20, 2020-23లలో 9 క్లైయిములకు రూ.58,69,702 ప్రోత్సాహం మంజూరు చేశామన్నారు. ఆటోనగర్‌లో 55 పరిశ్రమలకు మంచినీటి సరఫరా జరిగిందని, మిగిలిన 70 పరిశ్రమలకు కూడా త్వరగా అందించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఆటోనగర్‌లో గార్బేజ్ రవాణాకు సంబంధించి సమస్యను ఐలా సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. గార్బేజ్ కలెక్షన్ పనులను అవసరమైన చార్జీలతో జీవీఎంసీ నిర్వహించాలని సూచించారు. ఆటోనగర్‌లో ఆర్‌వోబీ నిర్మాణానికి రూ.27.10 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. ఈ నెలాఖరుకు టెండర్ పనులు తుది దశకు చేరుకుంటాయన్నారు. పీఎంఈజీపీ పథకం కింద పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేవారికి రుణాలు అందించి బ్యాంకర్లు సహకరించాలని కోరారు. విశాఖపట్నం ఆటోనగర్ స్మాల్ స్కేల్ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్త కార్యవర్గ సభ్యులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సిహెచ్.గణపతి, ఏపీఐఐసీ డిప్యూటీ జెడ్ఎం త్రినాథ్, ఐలా కమిషనర్ సూర్యనారాయణ, వాస్వా(వీఏఎస్‌డబ్ల్యూఏ) ప్రెసిడెంట్ పాండు రంగప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ వి.శ్రీనివాసరావు, సెక్రటరీ పి.వి.రామప్రసాద్, ఏపీ ట్రాన్స్‌కో, జీవీఎంసీ, వ్యవసాయ, మత్స్య శాఖ, అగ్ని మాపక, టౌన్ ప్లానింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

కొమ్మాది: 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 4వ వార్డు బీచ్‌రోడ్డు తిమ్మాపురానికి చెందిన ఓ విద్యార్థిని రుషికొండలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివింది. మొదటిసారి 10వ తరగతి పరీక్షల్లో ఫెయిల్ కావడంతో సప్లిమెంటరీ పరీక్షలకు హాజరైంది. ఈ పరీక్షల్లోనూ ఫెయిల్ అవడంతో మనస్తాపానికి గురైన ఆమె శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా తమకు సమాచారం లేదన్నారు.

నిరంతర శ్రమే భరత్‌ను ఈ స్థాయికి చేర్చింది

విశాఖ స్పోర్ట్స్: వికెట్ కీపర్, బ్యాటర్‌గా ఎదిగిన భరత్‌ను వైఎస్సార్ వీడీసీఏ-ఏసీఏ స్టేడియంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల ఐసీసీ ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్‌లో ఆడిన భరత్.. త్వరలో ప్రారంభం కానున్న వెస్టిండీస్ టూర్‌లో భారత టెస్ట్, వన్డే జట్లకు ఎంపికయ్యాడు. వీడీసీఏ తరఫున 2003-04 సీజన్‌లో అండర్-13 క్రికెట్‌లో అరంగేట్రం చేసిన భరత్ అనతికాలంలో రంజీల్లో ఓ వికెట్ కీపర్ 300 పరుగుల రికార్డును సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా వీడీసీఏ, ఏసీఏ సంయుక్తంగా భరత్‌ను ఘనంగా సత్కరించాయి. ఈ కార్యక్రమంలో వీడీసీఏ ఉపాధ్యక్షుడు డీఎస్ వర్మ మాట్లాడుతూ నిరంతర శ్రమ.. ఒదిగి ఉండే తత్వమే భరత్‌ను అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్‌లో భారత్ తరఫున ఆడేందుకు దోహదపడిందన్నారు. ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆటలను కెరీర్‌గా మలచుకోవచ్చని.. అందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలన్నారు. వీడీసీఏ వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ టెస్ట్ క్రికెటర్ ఎదగడానికి భరత్ కృషిని ప్రశంసించారు. వీడీసీఏ కార్యదర్శి పార్థసారథి మాట్లాడుతూ వీడీసీఏ తరఫున జూనియర్ స్థాయిలో అమిత్ ఫాథక్ తొలి అంతర్జాతీయ క్రికెటర్ అన్నారు. ఆ తర్వాత సీనియర్ స్థాయిలో టెస్ట్ క్రికెట్‌కు భరత్ ఆడుతున్నాడన్నారు. ఏసీఏ సీఈవో శివారెడ్డి మాట్లాడుతూ మరెంతో మంది భరత్‌లు ఏసీఏ నుంచి ఎదగాలన్నారు. భరత్‌కు తొలినాళ్ల కోచ్ కృష్ణారావు మాట్లాడారు.

ఒకప్పుడు నేనూ అందరిలాగే..

వీడీసీఏ తరఫున వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లాడిన క్రీడాకారుడు వేణుగోపాల్‌రావుకు సన్మానం చేస్తున్న రోజు అందరిలాగే గుంపులో నిలబడి ఆసక్తిగా గమనించాను. అప్పుడే అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కలగన్నాను. ఆటలో ఒడిదొడుకులను తట్టుకుని ముందుకు సాగాను. ఆట మొదలుపెట్టిన తొలినాళ్ల నుంచే జట్టుగా ఆడటం నేర్చుకున్నాను. క్రికెట్ వ్యక్తిగత క్రీడ కాదు. ఈ ఆటలో టెస్ట్ ఫార్మాట్ విభిన్నం. అప్పట్లో దేశవాళీ క్రికెట్‌లో రాణించి జాతీయ జట్టుకు అర్హత పొందే అవకాశం ఉండగా.. నేడు ఐపీఎల్ లాంటి పోటీల్లో మెరుగైన ప్రదర్శనతో అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.

– భరత్, క్రికెటర్

చిత్రలేఖనంలో ప్రపంచస్థాయి గుర్తింపు


శ్రీనివాసరావు

సీతంపేట: ఫాదర్స్ డే సందర్భంగా దుబాయ్‌కి చెందిన ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్‌ల సంస్థ వ్యవస్థాపకుడు అనిల్ కేజ్రీవాల్ ఆన్‌లైన్‌లో నిర్వహించిన చిత్రలేఖన పోటీలో నగరానికి చెందిన కనుమూరి శ్రీనివాసరావు ప్రపంచ స్థాయిలో ద్వితీయ బహుమతి పొందారు. బిడ్డ పుట్టిన ప్పటి నుంచి ఒక తండ్రి ఆ బిడ్డను వివిధ దశల్లో ఎంత ప్రేమగా చూసుకుంటాడో అద్దంపట్టేలా శ్రీనివాసరావు గీసిన చిత్రం ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందింది. 10 దేశాలకు చెందిన 200 మంది చిత్రకారులు పోటీపడగా జ్యూరీ స్కోర్, ఆన్‌లైన్ ఓట్ల ఆధారంగా శ్రీనివాసరావు గీసిన చిత్రానికి రెండో స్థానం లభించింది. దీనికి సంబంధించిన సర్టిఫికెట్‌ను సంస్థ ఆన్‌లైన్‌లో పంపింది. నాన్నలందరికీ తన చిత్రం అంకితం ఇస్తున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు. శ్రీనివాసరావు సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్‌లోని ఆర్‌బీఎం యూపీ స్కూల్‌లో ఒప్పంద ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

ఇద్దరు వలస కూలీల దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు, ఇద్దరికి స్వల్ప గాయాలు
- కూర్మన్నపాలెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బొలెరో వాహనం లారీని ఢీకొట్టడంతో ఇద్దరు బిహార్ యువకులు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. షీలానగర్ ప్రాంతంలోని స్పీడ్ నైస్ లాజిస్టిక్స్ సంస్థ(హెచ్‌పీసీఎల్)లో బిహార్ యువకులు పని చేస్తున్నారు. వీరిలో కొంత మంది అచ్యుతాపురం అభిజిత్ ఫైర్ ఎలాసిస్ కార్పొరేషన్ కంపెనీలో లోడింగ్ విభాగంలో మరమ్మతు పనులు చేసేందుకు గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో వీరు ప్రయాణిస్తున్న బొలెరో వాహనం కూర్మన్నపాలెం ఆర్టీసీ డిపో వద్ద లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సునీల్ గిరి(20), సెహవాజ్ (20)లు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. మహమ్మద్ రాజు ఖాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నజారుద్దీన్, ప్రమోద్ పాండే స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల సమాచారంతో దువ్వాడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. బొలెరో వాహన డ్రైవర్ నిద్రమత్తు వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. బిహార్ నుంచి వచ్చిన యువకులు హెచ్‌పీసీఎల్ సహా పలు సంస్థల్లో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

డ్రగ్‌ఫ్రీ సిటీగా విశాఖ

మహారాణిపేట: డ్రగ్‌ఫ్రీ సిటీగా విశాఖను తీర్చిదిద్దడానికి అన్ని వ్యవస్థలు సమిష్టిగా పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పిలుపునిచ్చారు. ఈ నెల 26న జరిగే డ్రగ్‌ఫ్రీ అవేర్‌నెస్ క్యాంపెయిన్ పోస్టర్‌ను శుక్రవారం కలెక్టర్ మల్లికార్జున తన చాంబర్‌లో విడుదల చేశారు. ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు, జాయింట్ డైరెక్టర్ బమ్మిడి శ్రీనివాసరావు, ఏఈఎస్‌బీ శ్రీనాథుడు, వినీషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బరౌని-కోయంబత్తూర్ మధ్య వీక్లీ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. బరౌని-కోయంబత్తూర్(03357) వీక్లీ స్పెషల్ బరౌనిలో ప్రతీ శనివారం రాత్రి 11.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు తెల్లవారు 3 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 3.20 గంటలకు బయల్దేరి మంగళవారం తెల్లవారుజాము 4 గంటలకు కోయంబత్తూర్ వెళ్తుంది. ఈ స్పెషల్ జూలై 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు నడుస్తుంది. కోయంబత్తూర్-బరౌని (03358) వీక్లీ స్పెషల్ కోయంబత్తూర్‌లో ప్రతీ బుధవారం తెల్లవారు 12.50 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 11.35 గంటలకు బయలుదేరి శుక్రవారం ఉదయం 6 గంటలకు బరౌని వెళ్తుంది.

వారణాసి రైలు పొడిగింపు

తాటిచెట్లపాలెం: కాశీ వీక్లీ రైలును మరికొంత కాలం పొడిగించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం-వారణాసి(08588) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నంలో ప్రతీ బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరుతుంది. మరుసటి రోజు సాయంత్రం 4.30 గంటలకు వారణాసి(బనారస్) చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూలై 5, 7వ తేదీల వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో వారణాసి-విశాఖపట్నం (08587)వీక్లీ స్పెషల్ ప్రతీ గురువారం సాయంత్రం 6 గంటలకు వారణాసిలో బయలుదేరుతుంది. మరుసటి రోజు రాత్రి 8.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు జూలై 6, 13 తేదీల వరకు పొడిగించారు.

రెండో క్యాజువాల్టీ నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు

మహారాణిపేట: కేజీహెచ్‌లో రెండో క్యాజువాల్టీ నిర్మాణానికి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. కేజీహెచ్‌కు రోగుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రస్తుతం క్యాజువాల్టీలో పడకలు సరిపోవడం లేదు. ఈ మేరకు మరో క్యాజువాల్టీ కోసం తయారు చేసిన ప్రతిపాదనలకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. ఇందుకు అవసరమైన రూ.30 లక్షలు మంజూరు చేయడంతో త్వరలో టెండర్లు పిలుస్తామని శివానంద్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థకు ఈ పనులు అప్పగిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న క్యాజువాల్టీకి పక్కనే 10 నుంచి 15 పడకలతో మరో క్యాజువాల్టీ నిర్మాణం చేపడతామన్నారు. రూ.15 లక్షలు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నుంచి, మరో రూ.15 లక్షలు సీఎస్సార్ నిధులు నుంచి ఖర్చు చేస్తామని వివరించారు.

ఉత్సాహంగా ఒలింపిక్ రన్


ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న విద్యార్థులు

బీచ్‌రోడ్: ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బీచ్‌రోడ్డులో ఒలింపిక్ రన్ ఉత్సాహంగా సాగింది. ఈ రన్‌ను ఎమ్మెల్యే గణబాబు జెండా ఊపి ప్రారంభించారు. పాండురంగాపురం ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి నోవాటెల్ సాంస్కృతిక వేదిక వరకు ఈ రన్ సాగింది. 2022-23లో జాతీయ పతకాలు సాధించిన ఇద్దరు ఉత్తమ క్రీడాకారులకు గుర్తించి ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ ప్రసాద్, అధ్యక్షుడు ప్రసన్నకుమార్, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, కోశాధికారి మోహన్ వెంకట్ రామ్, డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ, ఏయూ ప్రతినిధులు, మున్సిపాల్ స్కూల్ పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశల దీపం ఆరిపోయింది

- గంభీరం రిజర్వాయర్‌లో మునిగి ఎంటెక్ విద్యార్థి మృతి
- అందొచ్చిన కొడుకు అర్ధంతరంగా వెళ్లిపోయాడని తల్లిదండ్రులు రోదన


బాల సురేంద్ర (ఫైల్)

ఆనందపురం: ఓ ఇంటి ఆశల దీపం ఆరిపోయింది. గంభీరం రిజర్వాయర్‌లో మునిగి ఓ ఎంటెక్ విద్యార్థి మృతి చెందాడు. చేతికి అందొచ్చిన కుమారుడు అర్ధంతరంగా ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయాడంటూ ఆ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమై రోదిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

నగరంలోని జడ్జి కోర్టు పక్కన పితాని వీధికి చెందిన బడిగంటి సూర్యప్రకాష్, సీతాలక్ష్మి దంపతులకు బాల సురేంద్ర, భాను శివయశ్వంత్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. సూర్యప్రకాష్ టైలరింగ్ వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుండగా.. సీతాలక్ష్మి గృహిణి. బాల సురేంద్ర(24) ఆంధ్రా యూనివర్సిటీలో ఎంటెక్ మొదట సంవత్సరం, భాను శివయశ్వంత్ డిగ్రీ చదువుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు దృష్ట్యా సురేంద్ర రెండో పూట ఓ రెస్టారెంట్‌లో రూ.20 వేలు జీతానికి పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. ఇదిలా ఉండగా గురువారం రాత్రి సురేంద్ర, రెస్టారెంట్ యజమాని, మరో ఐదుగురు స్నేహితులు జీపులో బయలుదేరారు. అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో గంభీరం రిజర్వాయర్ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ కొంత సేపు కాలక్షేపం చేసి అందరూ గంభీరం రిజర్వాయర్‌లోకి ఈతకు దిగారు. గతంలో రిజర్వాయర్ గర్భంలోని మట్టిని తరలించగా పెద్ద గోతులు ఏర్పడ్డాయి. అవి ఊబిగా మారాయి. ఈతకు దిగిన వారిలో బాల సురేంద్ర మునిగిపోయాడు. అతను ఎంతకు బయటకు రాకపోవడంతో తోటి స్నేహితులు కేకలు వేశారు. ఫలితం లేకపోవడంతో పోలీసులతో పాటు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సీఐ రామచంద్రరావు, ఎస్ఐలు శ్యామ్‌సుందర్, నరసింహమూర్తి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈతగాళ్లను తీసుకొని వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం బాల సురేంద్ర మృతదేహం ఊబిలో కూరుకుపోయి ఉండడాన్ని గుర్తించి బయటకు తీశారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసును సీఐ ఆధ్వర్యంలో ఎస్ఐ నర్సింహమూర్తి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీల పక్షపాతి సీఎం జగన్


సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు

సీతంపేట: బీసీల అభ్యున్నతి కోసం పరితపిస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎస్.మారేష్ అన్నారు. అసెంబ్లీ బీసీ బిల్లు ప్రవేశపెట్టి పార్లమెంట్‌లో ప్రైవేటు మెంబర్‌బిల్లు ప్రవేశపెట్టిన పార్టీ వైఎస్సార్ సీపీ అని అన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో శుక్రవారం జరిగిన బీసీ సంఘ బలోపేతం, సమస్యల పరిష్కారం, సంక్షేమం, ఉత్తరాంధ్ర పర్యటనపై సంఘ నేతలంతా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు వస్తే ఎటువంటి ప్రతిఫలాలు వస్తాయో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం బీసీలకు అటువంటి ఫలాలు దక్కుతున్నాయన్నారు. సామాజిక న్యాయాన్ని ఒక నినాదంలా కాకుండా ఒక విధానంలా చేసుకుని సర్పంచ్ స్థాయి నుంచి రాజ్యసభ స్థానాల వరకు, మంత్రివర్గంలోనూ, నామినేటెడ్ పదవుల్లోనూ, స్థానిక సంస్థలలోనూ బీసీలకు కల్పించిన భాగస్వామ్యం చారిత్రాత్మకమైనదని అన్నారు. జూలైలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో 10 వేల మందితో బీసీ గర్జన సభ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు మరో 30 ఏళ్లు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని బలంగా కోరుకుంటున్నారని తెలిపారు. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తుల వెంకటరమణ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటే, బీసీల ఆర్థిక సుస్థిరతకు జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులతో కలిసి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.ఆర్.వి.కె.కిశోర్, రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, రాష్ట్ర మహిళాధ్యక్షురాలు వేముల బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా గరుడసేవ

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శుక్రవారం జరిగిన గరుడ సేవలో ఒడిశా భక్తులు తరించారు. మూడు నెలల పాటు అప్పన్నకు సేవలందించేందుకు సింహగిరికి వచ్చిన లక్ష్మీకాంత్ నాయక్ దాస్ స్వామికి ఈ గరుడసేవను జరిపించారు. ఒడిశాలోని భువనేశ్వర్, పట్టుపురం, బరంపురం, పూరి, రాయగడ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ సేవలో పాల్గొన్నారు. సాయంత్రం వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి విశేష పూలాలంకరణ చేసి వెండి గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. వింజామరతో లక్ష్మీకాంత్ నాయక్ దాస్ స్వామికి సేవలందించగా.. తమ సంప్రదాయం ప్రకారం ఒడిశా భక్తులు స్వామిని కీర్తించారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు చక్రవర్తి, పవన్‌కుమార్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

ఆరిలోవ: జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ ఆధ్వర్యంలో శుక్రవారం డీఎస్సీ 1998, 2008 బ్యాచ్ (ఎంటీఎస్) ఉపాధ్యాయులకు శుక్రవారం కౌన్సెలింగ్ జరిగింది. డీఎస్సీ 1998 బ్యాచ్ ఉపాధ్యాయులు 301 మంది, 2008 బ్యాచ్ ఉపాధ్యాయులు 186 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. సుమారు రెండేళ్లుగా పనిచేస్తున్న 2008 బ్యాచ్ ఉపాధ్యాయులకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, 1998 బ్యాచ్ వారికి మధ్యాహ్నం నుంచి కౌన్సెలింగ్ చేపట్టి ఉమ్మడి విశాఖ జిల్లాలోని పాఠశాలల్లో అవకాశం కల్పించారు. ముందుగా డీఈవో చాంబరులో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సమక్షంలో డీఈవో అభ్యర్థుల ప్రాధాన్యత ప్రకారం గ్రూపులను పిలిపించి స్క్రీన్‌పై ఖాళీలు ప్రదర్శించారు. ఆయా ఖాళీలను ఉపాధ్యాయులు కోరుకునే వీలు కల్పించారు. ఈ సందర్భంగా డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతూ పారదర్శకంగా కౌన్సెలింగ్ చేపట్టినట్లు తెలిపారు. ఇందులో కొందరికి మైదాన ప్రాంతాలు, మరికొందరికి ఏజెన్సీ ప్రాంతాల్లో అవకాశం కల్పించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని.. సక్రమంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

1998 బ్యాచ్ ఉపాధ్యాయుల ఆందోళన

2008 బ్యాచ్ ఉపాధ్యాయులకు మైదాన ప్రాంతంలో ఉన్న ఖాళీలను కేటాయించి.. తమను మాత్రం ఏజెన్సీకి వెళ్లమంటున్నారని 1998 బ్యాచ్ ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. తామంతా 50 ఏళ్లు దాటిన వారమని, ఏజెన్సీలో పనిచేయడం కష్టమవుతుందన్నారు. తమకు కూడా మైదాన ప్రాంతాల్లో నియమించాలని డిమాండ్ చేశారు. దీనిపై డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ప్రాధాన్యక్రమంలో కౌన్సెలింగ్ చేపట్టామన్నారు. కేటాయించిన చోట విధుల్లో చేరాలని ఉపాధ్యాయులకు స్పష్టం చేశారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొమ్మాది: జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. సంజయ్ తెలిపారు. 2024 జనవరి 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, www.navodaya.gov.in ను సందర్శించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లాలోని ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతుండాలన్నారు. గతంలో పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అనర్హులని చెప్పారు. 2012 మే 1 నుంచి 2014 జూలై 31 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు.

స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ

కంచరపాలెం: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా ప్రభుత్వ పాత ఐటీఐలో స్వల్పకాలిక వ్యవధి కోర్సులు నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ జి.శ్రీకాంత్ తెలిపారు. అసిస్టెంట్ టెక్నీషియన్ ఆర్ అండ్ ఏసీ, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ప్లంబర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణకు 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయసు ఉన్న వారు అర్హులని, 10వ తరగతి, అంతకంటే ఎక్కువ చదువుకున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తును పాత ప్రభుత్వ ఐటీఐలో అందజేయాలన్నారు.